
నూరేళ్ళ తెలుగు కథకు

**నవ్య నీరాజనం- 44**

నూరేళ్ళ తెలుగు కథకు



# నేను అందరివాణ్ణి! నాకు అందరూ కావాలి!!

**- ఆచార్య కొలకలూరి ఇనాక్**

ఆయనో 'ఊరబావి'. అందులో కథలు, కవిత్వం, నాటకాలు, నవలలు ధారలుగా ఊరుతూనే ఉంటాయి. తలలేని సమాజ పోకడలను ఆయన ఎండగట్టాడు. 'అస్పృశ్యగంగ'లు ఉండకూడదని కాంక్షించాడు. చదువులో, ఉద్యోగంలో, రాతలో ఎక్కడా రాజీ పడలేదు. తొమ్మిది కథా సంపుటాలు, తొమ్మిది నవలలతో పాటు అనేక పుస్తకాలు వెలువరించారు. 20 ఏళ్లు నిండకముందే లెక్చరర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, వైస్ చాన్సలర్ స్థాయికి ఎదిగారు. ఏడుపదుల వయసు వచ్చినా ఇంకా ఆయన రాస్తూనే ఉన్నారు. సమాజంలో పీడన ఉన్నంత వరకూ తన కలం పరుగు ఆగదంటున్న ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారితో ఇంటర్వ్యూ ఈవారం..

## చిన్నతనంలోనే నాన్న పోయారు

గుంటూరు తాలూకా వేజెండ్ల గ్రామంలో 1939లో పుట్టాను. మా అమ్మానాన్నలు విశ్రాం తమ్మ, రామయ్య. మాది మాదిగ కులం. డెబ్బై ఏళ్ల క్రితం మా కులం వాళ్లను ఎలా చూసేవారో మీకూ తెలుసు. అమ్మకు ముప్పై ఏళ్ల వయసులో నాన్న చనిపోయాడు. అప్పటికి మేం ముగ్గురం పిల్లలం. పేదరికం. ఇక మా కష్టాలు ఎలా ఉంటాయో చెప్పాల్సా? చిన్నతనంలో నేను చాలా తుంటరి వాడ్ని. అమ్మచేత తరచూ దెబ్బలు తినేవాణ్ణి. అయినా ఏడ్చేవాణ్ణి కాదు. 'ఏడవ్వేమిరా?' అని కొట్టేది అమ్మ. దెబ్బలకు ఒళ్ళు కదుములు కట్టేది. వాటిని చూస్తూ అమ్మ కన్నీళ్ళు కార్చేది.

## అన్నం తిని కాదు ఆశలు తిని బతికాం

నాన్న చనిపోయేప్పటికి అమ్మ చాలా ఆరోగ్యంగా, అందంగా ఉండేది. అప్పటికి నాకు పద కొండు, చెల్లికి ఏడు, తమ్ముడికి మూడు ఏళ్ళు. అమ్మ మారు మనువు చేసుకుని ఉంటే మేం దిక్కు లేని వాళ్లమయ్యేవాళ్లం. అమ్మ అలా చేయలేదు. మా కోసం తన జీవితాన్ని త్యాగం చేసింది. అమ్మ అన్నం తిని కాదు, ఆశలు తిని బతికిందని చెప్పాలి. మమ్మల్నీ అలానే బతికించింది. ఎప్పటికయినా బాగుపడతామనే ఆశ, ఏదైనా సాధిస్తామనే నమ్మకం మాలో అమ్మ నూరిపోసింది. ఇల్లు ఊడ్చటం, బట్టలుతకడం, వంట చేయటం దగ్గర నుంచి అమ్మ నాకు అన్ని పనులూ నేర్పింది. నేర్చు కోకపోతే తన్నేది. ఇంట్లో అందరం పని చేస్తే కానీ పూటగడవని స్థితి. అయినా ఎప్పుడూ అర్థాకలితో ఉండేవాళ్లం. ముప్పూటలా తిండి దొరికేది కాదు.

## బాల్యంలో మొదలైన పరుగు ఎక్కడా ఆగలేదు


నా ఆకలి, నా అంటరానితనం నుంచే నా ఆలో చనలూ, నా నడక రూపొందాయి. నేను నడవ లేదు. పరుగులు తీశాను. ఊర్లో కోళ్ళను పట్టుకోవా లన్నా, కుక్కలను తరమాలన్నా నేనుండాల్సిందే! అమ్మ కొట్టబోయినా, బావలు తన్నబోయినా దొరి కేవాణ్ణి కాదు. చాలా వేగంగా పరుగులు తీసేవాణ్ణి. అందుకే స్కూల్లో, కాలేజీలలో, యూనివర్శిటీలలో పరుగుపందేల ప్రైజులు నావే! నన్ను ఏడో ఏట జీతగాడిగా పెట్టారు. అక్కడ బర్రెలు కాసేవాణ్ణి. అలా చిన్నప్పుడే బర్రె సింహాసనం ఎక్కే అవకాశం దొరికింది. తొమ్మిదో ఏట ఫస్టుఫారంలో చేరాను. 14వ ఏట స్కూలు ఫైనల్. 15 ఇంటర్, 17 బి.ఏ.(ఆనర్స్), ఇరవై ఏళ్ళు నిండకముందే కాలేజీలో ఉద్యోగం, పాఠాలు చెప్పడం. నా పరుగు ఎక్కడా ఆగలేదు. ఈ చదువు నాకు ఆషామాషీగా లభించ లేదు. ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో ఆర్థిక ఇబ్బం దులు ఎదురయ్యాయి. చదవాలనే తృష్ణే నన్నింత వరకూ తీసుకొచ్చింది.

## ఏడాదిలో 200 రోజులు కూలిపనులకు పోయేవాడిని

ఆ రోజుల్లో స్కూలు పనిదినాలు 186 రోజులు. 140 రోజులు హాజరైతే పాసై పై తరగతికి పోవచ్చు. అయితే నేనెప్పుడూ పాస్ కాలేదు. ప్రమోట్ అయ్యాను. ఏడాదికి 200 రోజులకు పైగా అమ్మతో కలసి కూలి పనులకు పోయేవాడిని. అమ్మకు అర్ధరూపాయి, నాకు పావలా కూలి వచ్చేది. అప్పటికి ఇంకా చెల్లి, తమ్ముడు చిన్నపిల్లలు. కలుపు తీయటం, పొగాకు నారు మోయటం, మిరపనారు అందీయటం, వేరుసెనక్కాయ పీకటం మొదలు కొని వ్యవసాయంలో కూలీలు చేసే పనులన్నీ చేశాను. ఇంటర్ తర్వాత కూలి పనులకు పోలేదు. కూలీ పనులతో నాకు స్కూలు హాజరీ తక్కువ య్యేది. దీంతో 'పొలం పనులతో చదువు సంక నాకిందా?' అని కొందరు అడిగేవాళ్లు. నేను స్కూలుకు సరిగా పోకపోయినా ఏ రోజూ చదువులో వెనకబడ లేదు.

## దొంగతిండి తిండి కాదు..అది పెంట

కూలి పనులు ఏడాది పొడవునా ఉండవు. సీజ న్‌లో మాత్రమే ఉంటాయి. స్కూలు, పొలం పనులు లేనప్పుడు ఆటలాడ్డమే పని. గోలీలాట ఆడి పిండి గోలీలు, సీసం గోలీలు గెలుచుకునే వాణ్ణి. వాటిని అమ్మి అణా,అర్ధణా సంపాదించే



భార్య భాగీరథితో...


వాణ్ణి. ఖాళీ సిగరెట్టు పెట్టెలు ఏరుకు వచ్చి బచ్చా లాట ఆడి గెలిచి అణా సంపాదించేవాణ్ణి. చెట్లెక్కి కోతీకొమ్మచ్చి ఆడినట్టే వేప పుల్లలిరిచి, సైజులు నరికి కట్టలు కట్టి అమ్మేవాణ్ణి. మర్రాకులు పీకి విస్తళ్ళు కుట్టి అమ్మేవాళ్లం. ఈ సంపాదనంతా బేడా, అర్ధణా, అణాకు మించేది కాదు. ఇలా సంపాదిం చిందంతా అమ్మకు ఇచ్చేసేవాణ్ణి. అంతా ఆకలికే, పొట్టకే! ఒకసారి దీపావళి పండగకు పొలాల్లో వేరు సెనక్కాయలు దొంగిలించి అమ్మాను. ఆ డబ్బుతో టపాకాయలు కొని కాల్చాను. దొంగతనం చేసిన సంగతి తెలిసి అమ్మ నన్ను బాగా తన్నింది. ఏడుస్తూ 'నీది దమ్మిడీ పోరాదు, నీది కాంది దమ్మిడీ రారాదు. దొంగ తిండి తిండి కాదు. అది పెంట' అని చెప్పింది అమ్మ. అమ్మ జీవన సూత్రం కూడా అదే! అదే నాకూ నేర్పింది.

## తిండికోసం హాస్టల్లో చేరాం

మాకు నాన్న ఉన్నంతవరకూ తిండికి పెద్దగా తిప్పలుండేవి కావు. ఆయన పోయాక తిండి లేదు. ఆకలి మండిపోయేది. ఒళ్ళు దాచుకోకుండా పని చేసినా ఆకలి తీరేది కాదు. స్కూలు ఫైనల్లో హరి జన హాస్టల్లో చేరాను. అక్కడ అన్నం పెడతారు కదా! అందుకని చెల్లినీ, తమ్ముణ్ణి హాస్టల్లో చేర్చాను. హాస్టల్లో ఉంచడం కోసం వారిద్దరినీ స్కూల్లో చేర్చాను. మేం ముగ్గురం హాస్టల్లో చేరడంతో అమ్మకు కాస్త కాలూ, చేయి ఆడింది.

## ఇంటర్‌లో నా మొదటి కథ

రచనా వ్యాసంగం నన్నెంతగానో ఆదుకుంది. ఇంటర్‌లో ఉండగా(1954) నా మొదటి కథ అచ్చ యింది. ఆ కథకు రెండు రూపాయల పారితోషికం వచ్చింది. అప్పట్లో రెండిడ్లీ, కాఫీ మూడణాలు. అప్పటినుంచీ కథలు విస్తృతంగా రాసేవాణ్ణి. బి.ఏ.లో ఉండగా కథకు పది, పదిహేను రూపా యలు వచ్చేవి. బి.ఏ.లో ఉండగా నేను రాసిన 'దృష్టి' నాటకానికి రూ.250 బహుమతి వచ్చింది.



కుటుంబ సభ్యులతో...

ఆ డబ్బు అప్పటి లెక్చరర్ రెండు నెలల జీతంతో సమానం!

**ఆమె నాకు భార్య మాత్రమే కాదు**

నా పందొమ్మిదో ఏట గుంటూరులోని ఎ.సి.కాలేజీలో ఉద్యోగంలో చేరాను. నన్ను కోరుకున్న భాగీరథిగారితో నాకు పెళ్ళయింది. మాది కులం, మతం, వయస్సు, డబ్బు నిమిత్తం లేని పెళ్ళి. ఆమె నాకు భార్య మాత్రమే కాదు. తల్లి, తండ్రి, గురువు, దైవం.. అమ్మ తర్వాత అమ్మంత. అంతటి అద్భుత మూర్తికి భర్తనయిన అదృష్టం నాది.

**ఇప్పుడు ఆకలి చచ్చిపోయింది**

ముఖ్యంగా మా వైవాహిక జీవితం గురించి చెప్పాలి. మా పెళ్ళప్పటికి నా జీతం రూ.184. మా ఆవిడది రూ.262. తన జీతం మొత్తం నాచేతిలో పెట్టేది. నేను వద్దన్నా వినేది కాదు. మేం డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేశాం. రెండేళ్లకు తను గర్భవతి అయింది. అప్పుడు ఉద్యోగానికి ఐదేళ్లు సెలవు పెట్టింది. చిన్న పిల్లలకు పూర్తికాలం తల్లి అవసరం కదా. వరుసగా పిల్లలు పుట్టసాగారు. ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. దీంతో తన సెలవును మరో మూడేళ్లు పొడిగించింది. అప్పట్లో పదేళ్ల సెలవు పెట్టుకునే వెసలుబాటు ఉండేది. చిన్నోడికి నాలుగో ఏడు వచ్చాక వాడిని స్కూల్లో చేర్చి, తను ఉద్యోగంలో చేరింది. ఈ ఎనిమిదేళ్లూ నా ఒక్కని సంపాదనతోనే మా కుటుంబం నడిచింది. మా ఆవిడ తిరిగి ఉద్యోగంలో చేరటంతో ఆమె సంపాదనంతా మిగిలిపోతూ వచ్చింది. ఒక్కసారి పొదుపు మొదలుపెట్టామంటే ఇక అది పెరుగుతూనే ఉంటుంది. దానికి తోడు మా జీతం బాగా పెరిగింది. పొదుపు చేసిన వేలు లక్షలయ్యాయి. ఇప్పుడు పేదరికం లేదు. ఆకలి లేదు. తినే తొందరా లేదు. అప్పుడు ఆకలి ఉంది. అన్నం లేదు. ఇప్పుడు ఆకలి లేదు. అన్నం ఉంది. ఎంత తిన్నా అరగనంత సంపద ఉంది. అయితే ఆకలిని చంపుకోవాలన్న నాడు చావని ఆకలి, ఇప్పుడు చచ్చిపోయింది. మా పిల్లలు నలుగురూ బాగా చదువుకున్నారు. అందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. అందరివీ మంచి ఉద్యోగాలు.

**నేను జయించ లేనిది..**

నేను ఆకలిని జయించాను. సంపదను జయించాను. పేదరికాన్ని దాటాను. కానీ అంటరానితనాన్ని మాత్రం జయించలేకుండా ఉన్నాను. నా బాల్యంలో మా పల్లెను ఊరు వెలేసింది. మేమంతా 'అలగావాళ్లం'. రైలు స్టేషన్లో బెంచీలమీద కూర్చోనీరు. రైలు పెట్టెలో కూర్చోరాదు. స్కూల్లో వెనక బెంచీలో కూర్చోవాలి. గుళ్లోకి పోనీరు. భజనకు రానీరు. పక్కన కూర్చోనీరు. ఎవరూ నన్ను చేరదీయలేదు. ఒంటరిగా, ఏకాకిగా ఉండేవాడిని. నవ్వితే ఇష్టపడి వెంట ఉండనిస్తారని ఆశ. అందుకే ఎప్పుడూ ఏడవలేదు. నవ్వుతూనే ఉండేవాణ్ణి. నా అంటరానితనాన్ని నేను చదువుకోసం, ఉద్యోగాల కోసం ఉపయోగించుకోలేదు. ప్రొఫెసర్ అయ్యాను. డైరెక్టర్ను అయ్యాను. సెక్రెటరీని అయ్యాను. డీన్ను, ప్రిన్సిపాల్ను అయ్యాను. వైస్ చాన్సలర్ను అయ్యాను. ఎక్కడా ఎస్.సి. రిజర్వేషన్ లేదు. మెరిట్‌తోనే ఇవన్నీ సాధించాను. 20 ఏళ్ల వయసు నుంచీ 62 ఏళ్ల దాకా వివిధ హోదాల్లో పని చేశాను. అయినా అంటరానితనం నన్ను అంటుకునే ఉంది. నాడు బహిరంగంగా తాకే వారు కాదు. నేడు అంతరంగంగా తాకడం లేదు.

**మాట్లాడకుండా పనులు చేయించుకునేది**

నేను ప్రొఫెసర్ అయ్యాక కూడా చాలా రోజులు నాకు సైకిల్ ఉండేది. నన్నందరూ 'సైకిల్ ప్రొఫెసర్' అనేవాళ్లు. నాకు సైకిల్ ఉన్నప్పుడు మా ఆవిడకు గవర్నమెంట్ జీప్ ఉండేది. తను డిస్ట్రిక్ట్ వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పని చేసేది. తనెనాడూ నా మాటకు అడ్డు చెప్పలేదు. భార్యాభర్తల మధ్య ఉండాల్సింది పరస్పరం ప్రేమమాత్రమే కాదు, నమ్మకం కూడా. తను నన్ను నమ్మింది. ఇంట్లో పిల్లలను కూడా దండించేది కాదు. చాలా తక్కువ మాట్లాడేది. మాట్లాడకుండా పనులెలా చేయించుకోవచ్చో మా ఆవిడను చూశాకే తెలిసింది. 'మీకు ఇంత జీతం ఇస్తున్నారేమిటండీ' అనేది ఒక్కోసారి సరదాగా. నిజంగానే ప్రొఫెసర్లకు పని తక్కువ, జీతం ఎక్కువ. 'మీరు రోజూ చేసే కొత్త పనులు ఏముంటాయి. సంతకాలు పెట్టడమే కదా. మాది మానసిక శ్రమ. అందుకే మాకు జీతం ఎక్కువ' అనేవాడిని నేనూ నవ్వుతూ. నాకూ, నా కుటుంబానికి వెలుగునిచ్చిన భాగీరథి రెండేళ్ల క్రితం చనిపోయింది.



గుంటూరు శేషేంద్రశర్మ, భద్రిరాజు కృష్ణమూర్తి తదితరులతో...

**జీవితాన్ని చదివి రాస్తున్నారు**

గతంతో పోలిస్తే ఇప్పటి కథలు చాలా బాగుంటున్నాయి. ఇంతకుముందు చాలామంది ఇంగ్లీషులో చదివి తెలుగులో రాసేవారు. కానీ ఇప్పుడలా కాదు. జీవితాన్ని చదివి, జీవితాన్నే కథలుగా రాస్తున్నారు. అందువల్లే ఇప్పటి కథలు చాలా బాగుంటున్నాయి.

**పీడనలేకుండా పోయేదాకా రాస్తుంటాను**

పూర్వం అంతా బ్రాహ్మణ జీవితం సాహిత్యంలో ఉండేది. బ్రాహ్మణులు రాసేవాళ్ళు. వాళ్ళను మనం బ్రాహ్మణ రచయితలు అనలేదు. అలాగే కమ్మ రచయితలు, రెడ్డి రచయితలు అనలేదు. కానీ కొందరు అరసం, విరసం, స్త్రీవాదం, దళితవాద రచయితలుగా రచయిత్రులుగా పిలవబడాలని కోరుకుంటున్నారు. ఆ కోరేవాళ్లను అలా పిలవండి. నేను అన్ని రచనలూ చేశాను. చేస్తున్నాను. నన్ను ఏ ఒక్క పేరుతోనో పిలిచి సంకుచిత పరచకండి. కులం, ధనం కారణంగా గీతకు దిగువన వున్న అందరి గురించి నేను రాస్తున్నాను. అందరికోసం రాస్తున్నాను. ఆత్మతృప్తికోసం రాస్తున్నాను. పీడన లేనప్పుడు, అందరూ బాగున్నప్పుడే నాకు ఆత్మతృప్తి. నేను రాయవలసిన అవసరం లేకుండా పోయేదాకా రాస్తుంటాను.

- సుంకోజి దేవేంద్రాచారి

## నచ్చినవి

**నవల :** చెంఘిజ్ ఖాన్
**కవి :** జాషువా
**సినిమా :** ముత్యాల ముగ్గు
**పాట :** నేలతో నీడ అన్నది! నన్ను తాకరాదనీ..
**గాయని :** సుశీల
**గాయకుడు :** ఘంటసాల
**నటి :** సావిత్రి
**వ్యక్తి :** ఎన్.టి.ఆర్.
**వంట :** టమోటా పచ్చడి, పెరుగన్నం

## నాకు నచ్చిన నా కథ

# లేబరోళ్ళు

- కొలకలూరి ఇనాక్

చిన్నిగాడు నేల నుంచి ఎంత ఎత్తున్నాడో, అంతెత్తు వాడి చేతుల్లో ప్లేట్లు ఆకాశంలో ఉన్నాయి. వాడు సర్కస్‌లో తన శక్తియుక్తులు ప్రదర్శించేవాడు కాదు. హోటల్ సర్వరు. పన్నెండేళ్ళుండవు. ఉంటే వయస్సుకు తగ్గ పెరుగుదల లేదు. ఎందుకు లేదు? చెప్పలేం! ఆరోగ్యం బాగానే ఉంది. బహుశా కవులు చెబితే, జీవితం బరువు మోయలేక కుంగిపోయాడంటారు కాబోలు.

చలికాలం - డిసెంబర్ నెల చలిలో పొద్దున్నే లేచి చన్నీటితో స్నానం చేసి, పూజ చేసి, తల నున్నగా దువ్వుకొని, బొట్టు పెట్టుకొని, ఉతుక్కొన్న చొక్కా నిక్కరూ వేసుకొని ముచ్చటగా ఉన్న చిన్ని ముద్దుగా ఉన్నాడు. ఒక్కొక్క ప్లేటు ఒక్కొక్క కష్టమరు ముందు పెడుతూ వాడు సందేహించలేదు, అడగలేదు, సర్దలేదు. ఆరు టేబుళ్ళ మీద ఇరవై నాలుగు మందికి, వాళ్లేమి ఆర్డరు చేశారో అదే ఇచ్చి, చేతులకు అంటుకొన్న పుణ్యాం ఇంతవద్దు అనుకొన్నాడేమో తుడుచుకోసాగాడు.

నీళ్ళు అంటే ఇచ్చాడు. చట్నీ అంటే తెచ్చాడు. సాంబారు అంటే వేశాడు. ఏడు కాఫీ, మూడు బ్రూ అన్నాడు. క్షణంలో తెచ్చాడు. అరక్షణంలో అందించాడు. తెచ్చేటప్పుడు గాని, ఇచ్చేటప్పుడు గాని, కాఫీ గాని బ్రూ గానీ తొణకలేదు. చుక్క జారలేదు. పడలేదు. పది కప్పు సాసర్లు ఒకేసారి తెచ్చాడు. కాఫీ అడిగిన వాళ్ళకు కాఫీ, బ్రూ అడిగినవాళ్ళకు బ్రూ ఇచ్చాడు.

స్పూన్ అంటే ఇచ్చాడు. చెక్కెరంటే వేశాడు. డికాక్షన్ అంటే తెచ్చాడు. పాలంటే పోశాడు. బిల్లంటే రాశాడు, చించాడు. నీటిచుక్క అంటించాడు. టేబిల్‌కి అతికించాడు.

చిన్ని ఎందుకో కస్టమర్లను పాసెంజర్లు అంటాడు. వచ్చే వాళ్ళు వస్తున్నారు. తోవ ఇస్తున్నాడు. పోయే వాళ్ళు పోతున్నారు. తోవ చూపుతున్నాడు. పోయేవాళ్ళకూ నమస్కారం 'రేపు రండిసార్'! వచ్చే వాళ్ళకు నమస్కారం 'లోపలికి రండి సార్!'

నవ్వు, వాడూ కలిసే పుట్టారో, వాడు పుట్టగానే, వాడి ముఖం మీద నవ్వు పుట్టిందో, నవ్వును చొక్కా నిక్కరులాగా ఉతికి ఆరేసుకొని, పొద్దున్నే ముఖానికి వేసుకున్నాడో తెలియదుకాని, వాడి ముఖం నిండా నవ్వు ఉంది. అది శరీర మంతా వ్యాపించింది. వాడు నడుస్తుంటే నవ్వు నడుస్తున్నట్లుంటుంది. ఉండదు మరి! కవి ప్రవేశించాడు.

'కవిగారూ! నమస్కారం - రండిసార్. ఇవాళ ఆలస్యం అయిందే! గురూగారూ పొద్దున్నే నిద్ర లేవలేక పోయినట్లున్నారు. నిద్ర మత్తు వదిలినట్లు లేదు అని మీతో అనకూడదు. నిద్రాదేవి పరిష్వంగ సుఖం వదులుకోలేక దాన్ని వాటేసుకుని హోటల్‌కి వచ్చినట్లున్నారు. దానికి వేడివేడిగా ఏం తినిపిస్తారు? మీరేం తింటారు.

కవి చిన్ని భుజం తట్టి, బుగ్గ నిమిరి, వంగి నుదురు ముద్దాడి నిద్రను భుజాల మీదికి లాక్కుంటూ, ఆవులిస్తూ 'పొద్దున్నే నీ ముఖం చూస్తే సర్వపాపాలు గాలిపటాలై ఎగిరిపోతాయిరా చిన్ని' అని ఆవులింతను కొనసాగించాడు.

కవిగారు లాల్చీ పైజామా, రామ రామ, వదలరు. అతనొస్తే అవి వస్తాయి. సహధర్మచారిణులు. పైజామా కట్టుకొన్న భార్య, లాల్చి పైన పడుతున్న ప్రేయసి. అవెక్కడి ఆడపిల్లలో! నలిగిపోయి, ముడతలు పడి, రాత్రి తాకిడికి నలిగి, మెలిపడి కమిలిపోయి ముడుచుకుపోయిన పడుచు పిల్లల్లా ముసి ముసి నవ్వులు నవ్వుతుంటాయి.

కవి కూర్చుంటూ మళ్ళీ ఆవులించాడు. వందలాదిమంది కష్టమర్లకు చోటిచ్చిన కుర్చీ కూనిరాగం తీస్తూ కవిని కూర్చోమంది.

చిన్ని కష్టమర్ల దగ్గర ఆర్డర్లు తీసుకొంటున్నాడు. చిన్నిని చూడటం కవికిష్టం. కవిని పలకరించటం చిన్నికి సంతోషం.

'ప్లేటు ఇడ్లి, ప్లేటు వడ, ఒక మసాలా, ఒక సాదా, ఒక ప్లేటు ఇడ్లీ వడా, ఒక ప్లేటు రెండు ఇడ్లీ సింగిల్ వడ, ఒక ప్లేటు రెండిడ్లీ రెండు వడ, ఒక రవ్వదోసె, ఒక టమేటో బాత్, ఒక ఊతప్పం, ఒక సెట్ దోసె, ఒక ఉప్మా దేసె, ఒక దోసె, ఒక ప్లేటు పూరీ, సెవెంటీ ఎంఎం దోసె, ఒక పెసరట్ - ఉల్లీఅల్లం దోసె, ఒక కేసరీబాత్, ఒక మైసూర్‌బజ్జీ, ప్లేటు మసాలా వడ!'

చిన్ని తీసుకొన్న ఆర్డర్లు కేకలు పెట్టి, లోపలి వాళ్ళకు చెబుతున్నాడు.

కవి రోజూ చిన్ని ఇన్నిఆర్డర్లు ఇవ్వటం అన్ని ప్లేట్లు తేవటం, అందరికీ సక్రమంగా ఇవ్వటం చూస్తూనే ఉన్నాడు. అయినా ప్రతిరోజు ఆశ్చర్యపడుతూనే ఉంటాడు.

'పోయిన నిద్రనే ఏల పోదు
చేసిన సంసారమే ఏల చేతు
తినిన అన్నమే ఏల తిందు'

కవి గొణుగుతూనే ఉన్నాడు. 'తిన్న అన్నం తింటం ఏంటి గురూగారూ?' అన్నాడు చిన్ని.

'చిన్నీ! ఎవరేం ఆర్డరు చేశారో, వాళ్ళకదే ఎలా ఇవ్వగలవురా!' అని కవి అడిగాడు.

సర్వ్ చేశావంటే చిన్నిముఖం చిన్నబుచ్చుకొంటాడు. సప్లయి చేశావంటే ఇష్టపడతాడు. ఇచ్చావంటే తెలుగుభాషా పరిరక్షణ సమితి వాళ్ళు సంతోషిస్తారు.

చిన్నికి సప్లయర్, పాసింజర్ పదాలు ఇష్టం. సర్వర్, కష్టమర్ పదాలు ఇష్టం లేదు. కారణం తెలియదు.

'ఎవరేం కావాలన్నారో, అది వాళ్ళముఖం మీద అచ్చుగుద్దినట్లు వ్రాసి ఉంటుంది. ముఖం చూస్తే రాత కనబడుతుంది. రాత చదవటం, అడిగింది ఇవ్వటం అంతే' అన్నాడు చిన్ని.

కవికి కుతూహలం పెరిగింది.

'చిన్నీ! నేనేం తింటానని నా ముఖం మీద రాసి ఏం ఉందో చెప్పు!'

'గురూ గారూ! ఇది కావాలిరా చిన్నీ అని మీరు

చెబితే, అదే తీసుకుని వచ్చి, పదిమందిలో అయినా, ఎంత హడావుడి ఉన్నా, మీరు చెప్పింది మీకు ఇస్తా!'

'పోనీ నేను ఇవాళ ఏం తినాలో, తింటానో చెప్పు!'

'చెప్పనా? చెబుతున్నా గురూగారూ!'

'చెప్పరా?'

'పొగలెగసే, రవలుమిసే ఇడ్లీలు నాలుగు, గుంటూరు మిరపకాయల కారప్పొడి, తెనాలి ఆవునేయి, అంగలకుదురు అల్లం పచ్చడి, ఇంగువను మింగిన శంకర విలాస్ స్పెషల్ సాంబారు తేవాలి! తేనా?'

'తే!'

'సరీగ్గా చెప్పానా?'

'నూటికి నూరు!'

'ఒక్క క్షణం!'

చిన్ని తూనీగలాగా లోనికి వెళ్ళాడు. లేగదూడలా ఎగురుతూ వచ్చాడు.

చేతిలో తెల్లని ప్లేటు, పచ్చని అరిటాకు, మల్లె పూలు లాంటి ఇడ్లీ, కమ్యూనిష్టుల జండాలాంటి కార ప్పొడి, పసుపు కుంకుమ కలిపిన రంగు వంటి అల్లం పచ్చడి, తెనాలి మూడు కాలవల్లో నీళ్ళు పొంగిపోతు న్నట్లు కారప్పొడి మీద హద్దులు దాటి ప్రవహిస్తున్న నేయి – చిన్ని ఇంద్ర ధనుస్సును మోసుకొచ్చి పొగలె ల్లుతున్న ఇడ్లీలు కవి ముందుంచాడు.

తనను వరించిన శారదను నిద్రను తరిమేసి, తాను వరించిన ఇడ్లీలను పరిణయమాడటానికి మంగళ సూత్రం వంటి చెంచాలు చేతుల్లోకి తీసుకొన్నాడు కవి. ముఖం నిండా పెళ్ళికళ. కొడుకు పెళ్ళవుతుంటే సంతో షించే తల్లిలాగా చిన్ని సంతోషంగా ఉన్నాడు.

ఉదయం, పది గంటల్ని తిని బిల్లు చెల్లించి తన పని తాను చూసుకోవటానికి వెళుతూ ఉంది. కస్టమర్ల రాకపోకలు సన్నగిల్లాయి.

కవి ఇడ్లీలను సున్నితంగా, సుతారంగా తింటు న్నాడు. ఎంత సొగసో, ఎంత షోకో!

చిన్ని అంతమంది అడిగిన అన్ని పదార్థాలు, అంత జాగ్రత్తగా గుర్తుంచుకొని తెచ్చి ఎవరిది వాళ్ళకివ్వటం చూస్తే కవికి చాలాకాలంగా ఆశ్చర్యంగా ఉంటూనే ఉంది. 'ఏమి లేని అనాథ?' అని అనుకొన్నాడు. ఎంత గుర్తు! ఎంత నేర్పు! అష్టావధాని, శతావధాని, సహస్రావధాని అయ్యేవాడే చదువుకొని ఉంటే.

'చిన్నీ! చదువుకోకూడదటరా?''

'చదువుకోవచ్చు!'

'ఎందుకు చదువకోవు?'

'ఎవరు చదివిస్తారు? – అమ్మను నాన్న వదిలే శాడు. కానీ క్షయ, దగ్గు, మంచం ఆమె శరీరాన్ని వద లలేదు. కానీ గురూ గారూ! మీరు యమ్మే చదివారు. గోల్డు మెడలుంది. ఎవరు పిలిచి ఉద్యోగం ఇచ్చారు? కమ్మని కవిత్వం వ్రాశారు. వ్రాస్తారు. ఎవరి పిలిచి పిల్లనిచ్చారు? మీకు పాతికేళ్ళు వచ్చాయి. ఇంకా అమ్మా నాన్నలే పల్లె నుంచి డబ్బు పంపాలి. ఏం ప్రయోజనం? మీరు రోజూ ఇడ్లీలే తింటారు. పూరీ ఎప్పుడు? మసాలా దోసె ఎప్పుడు? విజిటబుల్ బిరియాని ఎప్పుడు? మీరు తినగలరు, తినరు. ఎందుకు? డబ్బు డబ్బుండాలి గురూ గారూ! ఎంతకాలం తల్లితండ్రులు పంపాలి? మా తల్లికి మందులు నేనే కొంటున్నా! ఈ హోటల్లో ఉండేవి అన్నీ, నాకు ఏది ఎంతకావాలో అంత కడుపు నిండా తింటున్నా. మీవి మాటలే గురూగారూ! నావి చేతలు! మీరు కవిత్వం వ్రాస్తారు! నేను కవిత్వంగా బతుకుతా! సరేనా? ఇడ్లీ చల్లారిపోతుంది దాని పని పట్టండి. మీ కాఫీ మీకు – ఇదిగో – తెచ్చేస్తున్నా' తుర్రుమని చిన్ని లోనికి పోయాడు.

కవి ఆలోచనలో పడిపోయాడు.

చిన్ని కాఫీతెస్తూ, పుస్తకాల సంచి తెచ్చాను. కాఫీ తాగుతూ కవి పుస్తకాలన్నీ చూశాడు.


పదో తరగతివి.

'ఎవరివి?'

'నావే!'

'ఎక్కడివి?'

'కొనుక్కొన్నా!'



'ఎందుకు?'

'చదువుకోవటానికి!'

'స్కూలుకు పోతుంటావా?'

'పోను!'

'ఎప్పుడు చదువుతావు?'

'రాత్రి!'

'అర్థమవుతాయా?'

'తెలుగు సులభం, లెక్కలు, మాదిరి లెక్కలు ఉంటాయి, ఇంగ్లీషు కూడబలుక్కుంటా. మీ మాటలు వింటా – తెలియని వాటిని అడుగుతా! సోషల్ హోటల్ కష్టమర్లే! సైన్సు మా వంట గదే – మనుషులు, కూరగాయలూ, ఆకు కూరలు, కందులు, మినుములు, పెసలు, సెనగపిండి, మైదా పిండి ఇదంతా మేమంతా జంతుశాస్త్రం. మావన్నీ బోటనీ, మేం చేసే పని భౌతికశాస్త్రం, సిద్ధమయ్యే పదార్థాలు రసాయనశాస్త్రం, వంట గదే ప్రయోగశాల, వంటాయన నా అయ్యవారు. హోటలాయనే హెడ్‌మాష్టరు. హోటలే నా స్కూలు. హోటలే నా హాస్టలు. హోటలే అమ్మానాయన'

కవి బిత్తరపోయాడు. ఇంగ్లీషులో మాట్లాడాడు. లెక్కల్లో సైన్సుల్లో, సోషల్లో పలకరించాడు. బదులాడటం విన్నాడు. తెలుగుజోలికి పోలేదు. కవిత్వం చెబుతాడని భయపడ్డాడో, కవిత్వం చెప్పి చెడిపోతాడని దిగులు పడ్డాడో తెలియదు.

'చిన్నీ! నువ్వు నాకు తమ్ముడివిరా!'

'గురూగారూ! మీరు నాకు గురూగారే! అన్న కాదు!'

'ఏం?'

'మీ తిండి మీరు సంపాదించుకొని, మీ కిష్టమయింది మీ స్వార్జితంతో తింటే నాకు మీరు – గురూగారూ! – అన్నగారు అవుతారు!'

కవి మళ్ళీ బిత్తరపోయాడు. నోటి వెంట మాట లేదు. వెంటాడుతున్న, పదయినా వదలని నిద్ర పటాపంచలయింది.

చిన్ని నుదుటి మీద సూర్యుడు కనిపించాడు కవికి చిన్ని కుంకుమ బొట్టు తడుం కొన్నాడు.

గల్లాపెట్టి కాడ నుంచి యజమాని లేచి వచ్చి కవి ముందు కుర్చీలో కూర్చున్నాడు. చెంచురామయ్యకు డెబ్బై ఏళ్ళుంటాయి. ఏభై ఏళ్ళ నుంచి ఆ కుర్చీలో ఆ బల్ల ముందు తానూ ఒక కుర్చీలా, బల్లలా సజీవంగా, అజీవంగా ఉన్నాడు. కదలికలేని బతుకు, నడుం నొప్పి, కాళ్ళూ కీళ్ళూ తీతలు, ఉదయం అయిదు గంటలకే వస్తాడు. రాత్రి పది గంటలకే ఇంటికి పోతాడు. బేంకులో డబ్బులు, ఇంట్లో పిల్లలు పెరుగుతున్నారు. బేంకు వాళ్ళు డబ్బును పెంచి పోషించగా, భార్య పిల్లల్ని కాపాడుతూ ఉంది. బేంకు వాళ్ళు భార్యను ఇంటిని రక్షిస్తున్నారు. అంతకుమించి తానేమీ పట్టించుకోడు చెంచురామయ్య.

కవి ఏం చదువుకొన్నాడో, ఏం చేస్తుంటాడో చెంచురామయ్య తెలుసుకొన్నాడు. చెంచురామయ్యను గురించి కవి అంతా తెలుసుకొన్నాడు. ఆ రోగాలన్నీ మాయమయ్యే మందులు చెప్పాడు. వైద్యుల వివరాలు తెలిపాడు. ఆత్మీయుడై పోయాడు.

వాళ్ళిద్దరి మాటల్లో చిన్ని నలిగిపోయాడు. అరిగిపోయాడు. కరిగిపోయాడు. మూడేళ్ళక్రితం చింకి బట్టలతో చీమిడి ముక్కుతో, ఎండు డొక్కతో ఏమన్నా పెట్టమని అడుక్కోవటానికి హోటల్ ముందు నిలబడ్డాడు. పని చేస్తే తిండి అంటే ఆ పనికి సిద్ధమయ్యాడు. చెప్పిన పనులన్నీ చేశాడు. ఏం తింటావో తినమంటే ఏమీ తినలేకపోయాడు. పేగులు తిన్నగా ఉన్నట్లుగా లేవు. మడతలు పడి ఉంటాయి. అందులో ఏమీ పోలేదు. కానీ చిన్నహోటలు వదిలి పోలేదు. క్లీనర్‌గా పనిచేశాడు. సర్వర్‌గా – అదేవాడి మాటల్లో సప్లయిర్‌గా మారాడు. వంట గదిలో పనులన్నీ తెలుసు. పొయ్యి మండలేదని నూనె పోసి మండించే వాళ్ళను మందలించే వాడు. వంటగదిలోంచి సంచుల్లోకి పోయే వాటిని కనిపెట్టే వాడు. బియ్యం గింజలు నూనెలు వీధిలోకి పోవటం చూశాడు. యజమాని పరిస్థితుల్ని చక్కదిద్దుకొనేటట్లు చేశాడు. రోలూ రుబ్బుడు పొత్రం మార్పించి గ్రైండర్ తెప్పించేట్టు చెప్పాడు. పొయ్యి పొగకట్టెలు బదులుగా సిలెండర్లు, స్టౌవ్‌లు వచ్చేట్లు చూశాడు. వాడికి అలివిమాలిన తెలివి. వల్లమాలిన నీతి నిజాయితీ. దొంగతనం లేదు. అబద్ధమాడడు. గొడ్డులాగా మేయడు. రోజుకు రెండుసార్లు స్నానం, శుభ్రంగా బట్టలు తొడుక్కుంటాడు. మిగతా వాళ్ళలాగా సినిమాలకు పోడు. షికార్లు లేవు. మిత్రులున్నారు. కబుర్లుండవు.



చెంచురామయ్య, తల్లి మందులకు డబ్బు కావాలంటే చిన్ని ఎంత అడిగినా, ఇస్తూనే ఉన్నాడు. ఎంతో అడిగేవాడు కాడు చిన్ని. పుస్తకాలకు డబ్బులు కావాలంటే వెంటనే ఇచ్చేవాడు. ఎకవుంట్లు వ్రాసే పని చెప్పి చూస్తే బాగా చేస్తూ ఉండటం చెంచురామయ్యను ఆశ్చర్యపరిచింది. కొడుకును చూచుకొన్నట్లు చూచుకోసాగాడు. ఇంట్లో కొడుకులు మాత్రం చదువుకొంటున్నారు. వాళ్ళకు ఎకవుంట్లు రాయటం చేతకాదు. హోటల్ కొడుకు మాత్రం స్కూలుకు పోడు. కానీ వేలు చూపితే చేయి పట్టుకొంటాడు. చిన్ని ఎకౌంట్లు బాగా నేర్చుకున్నాడు. రోజువారీ జమాఖర్చులు, నెలకు ఆదాయం తేల్చి చెప్పగలుగుతున్నాడు.

శంకరవిలాస్‌లో కష్టమర్లు తగ్గిపోయారు. మొత్తం మీద అన్ని టేబిళ్ళ దగ్గరా పదిమంది కంటే ఎక్కువ లేరు.

కవి ఉన్న టేబిల్ దగ్గర్నుంచి చిన్ని తన పుస్తకాల సంచి తీసుకుని లోనికి పోబోతున్నప్పుడు లేబరోళ్ళు బిలబిలమంటూ చొరబడ్డారు. వాళ్ళు నలుగురు. నాలుగు వైపులా కమ్ముకొన్నారు.

వాళ్ళు లోనికి రాగానే చెంచురామయ్య గల్లా పెట్టె దగ్గరకు నడిచాడు. చిన్ని సంచితో సహా కవి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

'కుర్చీలో కూర్చున్నందుకు, మీ ఎదుట కూర్చున్నందుకు నన్ను క్షమించండి'

కవికి ఏమీ అర్థం కాలేదు. 'ఏమైనా పాఠం చెప్పాలా?' అన్నాడు.

'మీచేత పాఠం చెప్పించుకునే అదృష్టం కలిసివస్తే ఎంతో ధన్యుణ్ణి!'

ఈ లోపల హోటల్లో పనిచేస్తున్న చిన్నపిల్లలు పారిపోయారు. పెద్దవాళ్ళు ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

'మీ హోటల్లో పనిచేసే సర్వర్లు, క్లీనర్లు ఏరి?' లేబరాఫీసరు అడిగాడు.

'పదకొండు – పన్నెండు మధ్య సమయంలో వాళ్ళకు విశ్రాంతి. ఎక్కడెక్కడో ఉంటారు'

'చిన్నపిల్లలు ఎంతమంది మీ హోటల్లో పని చేస్తున్నారు?'

'ఎవరూ లేరు!'

అటెండెన్సు రిజిష్టరు చూపమంటే చూపాడు. వాళ్ళ వయస్సులు ఇరవైకి పైనే ఉన్నాయి.

హెడ్‌కుక్కు అసిస్టెంటులు ముగ్గురు వంటగదిలోనే ఉన్నారు. వాళ్ళు కాక వండిన వాటిని ప్లేట్లల్లో వేసి ఇచ్చేవాళ్ళు ఇద్దరు. కాఫీ, టీ, బ్రూ, బూస్ట్‌కలిపి ఇచ్చేవాడు ఒకడు. వాళ్ళంతా వాళ్ళ స్థానాల్లో ఉన్నారు. సర్వర్లు అయిదుగురిలో ఒక్కడే ఉన్నాడు. క్లీనర్లు నలుగురూ లేరు.

'వీళ్ళంతా ఏరి?'

'వాళ్ళకిప్పుడు రెస్ట్'

లేబరాఫీసరు చిన్ని దగ్గరకు వచ్చాడు.

'నీ పేరేమిటి?'

'చిన్ని!'

'ఏం చేస్తుంటావు. క్లీనరా? సర్వరా?'

'క్లీనరూ కాదు, సర్వరూ కాదు. అయినా సర్వరేంటి? సప్లయరు అనలేరా?'

'ఏం సర్వరంటే?'

'ఎవడూ మనకు సర్వ్ చేయడు. మనకు కావలసింది వాళ్ళు సప్లయి చేస్తారు!'

'ఆహాఁ! అలాగ్గా! ఏం చదువుతున్నావు?'

'టెన్త్'.

'టెన్తా? నీ వయస్సుఎంత?'

'పన్నెండేళ్ళు దాటింది. పదమూడో ఏడు జరుగుతూ ఉంది'

'ఇంత చిన్న వయస్సులో పదా? ఏ స్కూల్లో?'

'గురవయ్యలో'

'ఏయి పుస్తకాలు?'

చిన్ని సంచి లేబరాఫీసరుకు అందించాడు. ఆఫీసరు పుస్తకాలన్నీ చూశాడు. అన్నింటి మీద చిన్ని పేరు. యల్.చిన్ని, బి.సెక్షన్, నంబరు 10, టెన్త్ క్లాసు. మాజేటి గురవయ్య హైస్కూలు, బ్రాడీపేట, గుంటూరు అని ఉంది.

'పదమూడేళ్ళకే పదిలోకి వచ్చావా? బాగా చదువుకో! అభివృద్ధిలోకి వస్తావు!'

లేబరాఫీసరు, జవాన్లు వెళ్లిపోయారు. పసిపిల్లలెవరూ ఈ హోటల్లో పని చేయటం లేదని రాసుకొని మరీ వెళ్ళిపోయారు.

లేబరోళ్ళు వెళ్ళగానే చిన్ని కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

కవికి ఆశ్చర్యంగానే ఉంది. 'నీ పేరు చిన్నికదా, యల్, ఏమిటి' అని అడిగాడు.

'అందరి పేర్ల ముందు ఇంగ్లీషు అక్షరాలలో కనీసం ఏదో ఒకటి ఉంటుంది కదా'

'ఉంటుంది. నిజమే. మరి యల్ అనే ఎందుకు వ్రాసుకొన్నావు? మీ ఇంటి పేరేమిటి?'

'నాకు తెలియదు!'

'యల్ అంటే ఏమిటి?'

'లావు'

'లావు ఇంటి పేరా?'

'నా పేరు చిన్ని కదా, నేను లావుగా ఉంటాను కదా. అందుకని నేను లావు చిన్ని, యల్. చిన్ని'.

'నీ పేరు చిన్నీనేనా?'

'తెలియదు. అందరూ అలాగ్గే పిలుస్తున్నారు. అమ్మ కూడా అంతే!'

'చిన్ని ముద్దు పేరు అయి ఉంటుందిరా. అసలు పేరు ఏదో ఉంటుంది!'

'గురూగారూ! ఏ పేరయితే ఏముంది సార్? శరీరం మీద ఒక చెమట చుక్క నోట్లోకి ఒక మెతుకు, ఇంతేకద బతుకు'.

కవికి కళ్ళు తిరిగినట్లయింది.

'ఏరా చిన్ని కవిత్వం చెబుతున్నావు?'

'నన్ను తమ్ముడన్నారు కదా గురుగారూ! అన్న విద్య అంతయినా అబ్బదా? గురూగారూ! నేను చెప్పింది జీవితం, మీరు కవిత్వం అనుకొన్నారు!'

'అవును చిన్ని. కవిత్వం అంత బాగా జీవితం కాని, జీవితం అంత సారభూతంగా కవిత్వం కానీ ఉంటే ఎంత బాగుంటుంది?'

'కవిత్వమా? వేదాంతమా? గురూగారూ!'

'నీ పుస్తకాల మీద పూర్తి పేరు, క్లాసు, నెంబరు, సెక్షను, స్కూలు అడ్రసు అన్నీ ఎందుకు రాసి పెట్టుకొన్నావు?'

'అదొక కల. అవన్నీ ఉండాలని కమ్మని కల. అవన్నీ ఉన్న సంచి కేరియరు తీసుకొని రోజూ స్కూలుకు పోవాలని కల. క్లాసులో కూర్చుని విని, ఇంటి దగ్గర చదివి, నేర్చుకొని మంచిమార్కులతో పరీక్షలు పాసయి, అమ్మానాన్నల ముద్దులు, ముద్దలు తినాలని కల. ఎన్నోకలలు గురూగారూ, అవన్నీ నెరవేరతాయా? పదో నంబరు, పదో తరగతి బతుకు సంపూర్ణ సంఖ్యాగా మారుతుందని కల'.

చిన్ని చేతిగుడ్డ తీసుకొని ముక్కు తుడుచుకున్నాడు. కవి కళ్ళు చెమ్మగిల్లాయి.

చిన్ని పుస్తకాల సంచి కళ్ళకద్దుకొంటుంటే కవి అడిగాడు. 'నువ్వెందుకు అబద్ధమాడావు? నువ్వు అబద్ధమాడవనుకొన్నాను'.

'ఒక్క అబద్ధమాడాను. అమ్మకు మందులు కొనుక్కుపోగలను. నిజం చెబితే అమ్మకు మందులుండవు. నాకు అన్నం ఉండదు. పని ఉండదు. అడుక్కు తినాలి! సరేగానీ – మీకు పెళ్ళి చేయాలికదా! నూరు అబద్ధాలు ఆడను'.

'నీకు చదువుకోవాలని ఉంది కదా!'

'ఉంది!'

'బాల కార్మికుల్ని లేబరు డిపార్టుమెంటు తీసుకుపోయి, హాస్టల్లో ఉంచి, స్కూల్లో చేర్చి భోజనం పెట్టి చదువు చెప్పిస్తారు. వాళ్ళ వెంటపోయి ఉంటే బాగుండేదేమో!'

'నిజమే గురూగారూ! అమ్మకు మందులు ఎవరు తెచ్చి ఇస్తారు? నా దగ్గర ఏ సర్టిఫికెట్టూ లేదు. నన్ను ఏ తరగతిలో చేర్చుకొంటారు! ఒకటిలోనా పదిలోనా? ఒకటిలో చేరిస్తే దూడల్లో ఎద్దులాగా ఉంటా. పదిలో చేరిస్తే – నేను అర్హుణ్ణే అయినా, సర్టిఫికెట్లు లేని పాపాన, ప్రపంచం ప్రాణాలు పోతాయి. హాస్టల్లో వాళ్ళు పెట్టే అన్నం అడుక్కు తినేవాళ్ళు కూడా తినరు. అంతహీనంగా ఉంటుంది. హోటల్లో ఇన్ని రకాల పదార్థాలు రుచి తెలిసిన నేను దాన్ని అసలు తినలేను. అక్కడ ఉండలేను. ఒక పసివాడు పనివాడు అయిందాకా ఊరుకొని, వాడు చదువుకు దూరమై, ఏదో సంపాదించుకొంటున్నప్పుడు, పూనుకొని వాణ్ణి రెండింటికి చెడ్డవాడినిగా చేయటానికి వీళ్ళు రావటం నాకెందుకో బాధగా ఉంది'

'బాలబాలికలు పసితనంలో కార్మికులుగా మారితే, వాళ్ళ శారీరక మానసిక వికాసం రావలసినంత రాక, ఉండవలసినంత ఉండక, ఉన్నదంతా ఊడ్చి పెట్టుకుపోయి, వీళ్ళు అతి బాల్యంలోనే వృద్ధాప్యం వచ్చి, రోగుల్లై, బాధల్లై, కన్నీళ్ళై, ఉత్తమ పౌరులు కావలసినవాళ్ళు మహోత్తమ రోగుల్లై, ఊపిరాడని జీవుల్లై, కడుపు కాలే ప్రాణుల్లై, పసి తనంలోనే పసి శవాల్లై పోవటం దేశానికి మేలు కాదు కదా!'

'గురూగారూ! స్వప్నాలు, సౌందర్యాలు, దేవతలు, ప్రేయసులు, ప్రేమలు మాత్రమే మీ ఆలోచనలో ఉంటాయనుకొంటున్నాను కానీ, మీరు కూడా బాధలు, కన్నీళ్ళు, రోగులు, శవాలు గురించి ఆలోచిస్తారనుకోలేదు.

నాకు తల్లితండ్రుల ముద్దుమురిపాలు లేవు. మాట మంచిదయితే ఊరు మంచిదన్నట్లు మీ అందరి ప్రేమ హోటల్ పాసింజర్ల ప్రేమ అద్భుత వరం.

పసివాడు అలవిమాలిన పనిచేస్తే కుంగిపోవటం నిజమే. కానీ ఈ పని అలవి మాలింది కాదు. ఆనందంగా చేసేదే! ఈ తిరగటం, అరవటం, అటూ ఇటూ పరుగెత్తటం చిన్నపిల్లల ఆటవంటిదే! చిన్నపిల్లలకు ఆటపాటలు కావాలి కదా!

చదువుకొనే వయస్సులో చదువుకోకపోవడం అన్యాయమే. హోటల్లో ఎంత మంది జనం. ఎన్నిరకాల జనం. ఎన్ని మనస్సులు. ఎన్ని మాటలు. ఎంత చదువు. ఎంత విద్యావంతుడయినా పుస్తకాలు చదవటం మాని జీవితం చదవటం ప్రారంభించాలి కదా! ఆ జీవితాన్ని చదివేందుకు హోటల్ మంచి పాఠశాలే! పుస్తకాల చదువు ఉండదు కానీ, ఇక్కడ బతుకు చదువు ఉంది. మీరు పుస్తకాల చదువు కావాలన్నారు కదా. ఇదిగో పుస్తకాల చదువు' అంటూ సంచి చూపించాడు చిన్ని.

కవి ఏమీ మాట్లాడలేక పోయాడు. స్కూలులో కళాశాలల్లో చదివితే సర్టిఫికెట్లు డిగ్రీలు వస్తాయి. ఉద్యోగాలు దొరుకుతాయి. కాలం మారింది. మంత్రాలకు చింతకాయలు రాలనట్లే డిగ్రీలకు ఉద్యోగాలు దొరకటం లేదు. ఏదైనా నైపుణ్యం ఉంటే బతుకు దెరువు ఉంటుంది. చిన్నికి బతుకుదెరువు ఏర్పడింది. క్రమంగా నైపుణ్యం కూడా తన పరిధిలో తాను సంపాదించుకొంటున్నాడు.

'పసితనం బలికాకూడదు కదా!'

'కాకూడదు'!

'బాల్యం ఆటపాటలతో గడవాలి కదా!'

'గడవాలి!'

'బాల్యం జీవితానికి పునాది కావాలి కాని కట్టడమే కారాదు కదా!'

'కారాదు. గురూగారూ! బాల్యం అందరికీ బంగారు స్వప్నంగానే ఉండాలి. అమ్మా నాన్నలుండాలి. ఆటపాటలుండాలి. చదువు సంధ్యలుండాలి. శారీరక మానసిక వికాసం ఉండాలి. బాలబాలికలు ఉత్తమ పౌరులుగా పెరగాలి. అంతా న్యాయమే'.

## బాలకార్మికులు లేకుంటే ఎంత బాగుణ్ణు



బాల్యం బంగారు లోకం. డబ్బుంటే అంతా ఆనందమే? లేకుంటే అంతా దుఃఖమే! అదృష్టవంతులు వెలుగు సింహాసనం ఎక్కుతారు. దురదృష్టవంతులు చీకటి అగాధాల్లోకి కూరుకుపోతారు. ప్రభుత్వాలు బాల కార్మికుల్ని నిషేధిస్తాయి. కానీ బాలలు కార్మికులు కాకుండా సమాజం శాసిస్తే ఎంత బాగుణ్ణు! ఆ ఆశే! ఈ కథ– లేబరోళ్ళు.

**– ఆచార్య కొలకలూరి ఇనాక్**
**4-282, ప్లాటు నెం.4, పేజ్**
**న్యూ సర్వోదయ నగర్, మీర్‌పేట్**
**వైశాలి నగర్ పోస్టు,**
**సరూర్ నగర్ మండలం**
**హైదరాబాదు - 500079**
**సెల్: 9440243433**

'మరి అన్యాయం ఏముంది చిన్ని!'

'బాల్యంలోనే పని పాటలు చేయవలసిన దుర్గతి పట్టినవాళ్ళకు, అమ్మానాన్నలు లేనివాళ్ళకు, ఆటపాటలు చదువు సంధ్యలు లేని వాళ్ళకు, ఏ వికాసం రాని వాళ్ళకు, ఏది దారి? నన్ను అయిదేళ్ళకే ఎవరైనా పట్టుకొని ఉండవచ్చు కదా. అమ్మనాన్నాల ప్రేమ చూపి ఉండవచ్చు కదా. అడుక్కోకుండా చేసి ఉండ వచ్చు కదా. ఎవరూ ఎందుకు ఏమీచేయలేదు? ఇప్పుడెందుకు నన్ను పట్టుకు పోవటం? నా నోటి కాడి కూడు పారేయటం? పని పిల్లలుగా మారబోతున్న పిల్లల్ని కనిపెట్టి కాపాడితే మంచిది. బిచ్చగాళ్ళుగా, వీధి బాలలుగా, భవిష్యత్తు దొంగలుగా, హంతకులుగా మారబోతున్న వాళ్ళను బాల్యంలోనే చేరదీయాలి. అది రక్షించటం. నన్ను తీసుకుపోతే ఇది శిక్షించటం. నేను పుట్టగానే నన్ను పట్టుకుపోయి ఉండవలసింది. మా అమ్మానాన్నల ఆరోగ్యం బాగా ఉండేట్టు చేసి ఉండవలసింది. మా అమ్మానాన్నల పేదరికం నిర్మూలించి ఉండవలసింది. ఇప్పుడా నన్ను రక్షించటం – ఆ పేరుతో హింసించటం, చేతులు కాలి పదేళ్ళు దాటింది. ఇప్పుడు నాకు ఆకులెందుకు? అప్పుడయినా అవి అక్కరలేదు. నా చేతులుకాదు, జాతి, దేశం చేతులు కాలకుండా చూడవలసింది. బాల కార్మికుల్ని ఉద్ధరించటం కాదు, బాలల్ని కార్మికుల్ని కాకుండా చూస్తే చాలు. ఈ రైలు తెనాలి, ఆ రైలు నరసరావుపేట, ఆ రైలు మాచెర్ల బయలుదేరాయి. వాటిని అలా వెళ్ళిపోనీయాలి. మధ్యలో ఆపకూడదు. వెనక్కు మరల్చకూడదు. ప్రయోజనం ఉండదు. పైగా ప్రమాదం ఉంటుంది. ప్రమాదం జరక్కుండా చేద్దామని పెద్ద ప్రమాదం సృష్టించకూడదు'

కవి పైకి లేచాడు. చిన్నిని పొదివి పట్టుకొన్నాడు. కళ్ళలో నీళ్ళు గారుతున్నాయి. ముక్కుముఖం అదురుతున్నాయి. కన్నీళ్ళు కారి చెంపల మీద జారుతున్నాయి. పైకెత్తుకొన్నాడు. ముద్దు పెట్టుకున్నాడు. దించలేదు. చిన్నిదిగాలని చూడలేదు. అన్నవంటి గురూగారి ఆలింగన సుఖం అనుభవిస్తున్నాడు. ఇద్దరూ ఇద్దరి కళ్ళు తుడుస్తున్నారు. చెంచురామయ్యకు పట్టరాని దుఃఖం సంతోషం కలగలసి పోయాయి.

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చాడు, నెత్తి చురచురలాడుతూ ఉంది. చెంచురామయ్య తలలో వెలుతురు పుట్టింది.

ఒకరిద్దరు వస్తున్నారు. స్వీటు తిని, హాట్ నమిలి, కాఫీ చప్పరించిపోతున్నారు.

లేబరోళ్ళు వచ్చినప్పుడు పారిపోయిన సర్వర్లు – అదే సప్లయర్లు – క్లీనర్లు నెమ్మది నెమ్మదిగా శంకర విలాస్‌లోకి చేరుకొన్నారు.

హోటల్ మళ్ళీ నిండుగా ఉంది. చెంచురామయ్య చిన్ని దగ్గరకు పోయాడు. వాడింకా కవి ఆలింగన సుఖంలోనే ఉన్నాడు. ఇద్దరి భుజాలు పట్టుకొన్నాడు చెంచురామయ్య. 'కేసు లేకుండా కాపాడావురా చిన్నినాన్నా' అన్నాడు. కవితో చెప్పాడు. 'చిన్నికి ఈ హోటల్ని నడిపే పూర్తి శక్తి సామర్థ్యాలున్నాయి'.

కవి ఆనందంతో ఆశ్చర్యంగా చూస్తుంటే చిన్ని అన్నాడు 'వయస్సు లేదు'.

'వయస్సు దేముందిరా ఈ హోటల్ నడిపే అన్ని తెలివితేటలు నీకున్నాయి. నాకు విశ్రాంతి ఇవ్వరా! నీకు మాట సహాయం నేనెప్పుడూ చేస్తూనే ఉంటానుగా'.

'హోటల్ నడపగలను. ఒప్పుకుంటాను. కానీ వయస్సు చాలదు. అనుభవం చాలదు. తండ్రి వంటి మీకో మాట చెప్పనా?'

'చెప్పు!'

'హోటల్ అంతా నేను చూచుకొంటాను. గల్లా పెట్టె అన్న చూచుకొంటాడు. మీకు పూర్తి విశ్రాంతి. హోటల్ మీదే. మేం మీ జీతగాళ్ళం'

'కాదు కొడుకులు – మీరూ భాగస్థులు'.

'మీరు హోటలు పాసింజరు అయితే – గురూగారు. గల్లాపెట్టె బల్ల దగ్గర కుర్చీలో కూర్చుంటే – అన్నగారు. మీరు నాకు గురూ గారా? అన్నగారా?'

'అన్నగారే' అన్నాడు చెంచురామయ్య. కవికి అర్థమయ్యేలోగా కుర్చీలో కూర్చోబెట్టారు. ఉద్యోగం వచ్చింది. కళ్ళు తిరుగుతున్నాయి. బిత్తరగా ఉంది. ఏడుపు వస్తూ ఉంది.

ఎదురుగా చేతులు కట్టుకొని నిలబడ్డ చిన్ని అన్నాడు.

'అన్నగారూ! మీరిక్కడ కూర్చున్నంతసేపు అక్షరాలు మర్చిపొండి. అంకెలు గుర్తుంచుకొండి. రూంకు పోయాక అంకెలు మర్చిపొండి అక్షరాలతో ఆడుకొండి!'

*

కవిత

# పిల్లలూ.. దేవుడూ.. మరికొన్ని మాటలు..




చాచిన రెండు చేతుల మీద
ఒక సత్తుబేసినూ..,
ఆ బేసిను మధ్యలో
గుండెల కానించి నిలబెట్టిన దేవుడి పటంతో
ఆ పిల్లలు వచ్చి నిలబడతారు.
పల్లెత్తు మాటుండదు
చెయ్యెత్తి అడిగేదుండదు.
అంతా ఆ దేవుడి పటమే చెబుతుందన్నట్టు
ఆ దేవుడి చిత్రమే ముఖచిత్రం చేసుకుని నిలబడతారు.
ఆ పటం ముంగిట్లో కాసింత పసుపూ కుంకుమ..
కుంకుమలో మునిగి అక్కడక్కడ
కాసిన్ని దయాదాక్షిణ్యాలు..
పల్లెత్తు మాటుండదు
చెయ్యెత్తి అడిగేదుండదు.
అగరొత్తుల పొగల మధ్య ఘాటుగా తగుల్తూ
ఆ పసికళ్ళల్లో
ఆకలి పేగులు కాలుతున్న వాసన
ఏడెనిమిది వయస్సు వుంటుందా పిల్లలకు..?
ఎవరు నేర్పుంటారు..? ఎక్కడ నేర్చుకుంటారు..?
దేవుడ్ని అడ్డం పెట్టుకుని యాచించొచ్చని..?
నల్లబట్టల్లోనో పసుపు ఎరుపు దుస్తుల్లోనో
పుణ్యస్థలాలకు వెళ్తున్నామని కండువా చేతులు చాచి
పుణ్యదానాల్ని స్వీకరించే ముదురు భక్తులు
కొందరు..
పొద్దు గుంకే సరికే
పానశాలలో మద్యమిత్తవ కాళ్ళముందు
పారవశ్యంతో దొర్లుతున్న పావన దృశ్యాలు..
మొట్టికాయలేసే కొన్ని చేదు పాఠాలు..
వద్దనుకున్నా వచ్చే వాణిజ్య ప్రకటనల్లా
మెదడు తెరని ఆవహింపచేస్తాయి.
ఆ పిల్లలు అలాగే నిలబడి ఉంటారు.
వాళ్ళ చేతుల్లోని దేవుడి పటంలో
దేవుళ్ళు నిలబడినట్టు.. వాళ్ళట్టాగే..
నిలువుకాళ్ళ విగ్రహాల్లాగ నిలబడి వుంటారు.
దేవుడి పేరు మీద
మోసపోతూనో.. మోసం చేస్తూనో..
దేవుడ్ని అడ్డం పెట్టుకొని
గద్దెలెక్కుతూనో.. గద్దెదించుతూనో..
రధయాత్రలు చేస్తూనో.. రక్తం కళ్ళ చూస్తూనో..
దైవ నామస్మరణ చేస్తూ
మానవ విలువలార్పణం చేస్తున్న..
ఆరని మతం మంటల్లో
మనుషుల్ని అజ్యం చేస్తున్న
ఈ దేశంలో.. దౌర్భాగ్యంలో..
ఈ పిల్లలు..
దేవుడికి ప్రతి రూపాలని పురాణాలన్నీ ఘోషించే
ఈ పసిపిల్లలు..
కళ్ళల్లో ఆకలి ఒత్తుల నుసి రాలుతున్న ఈ పిల్లలు..
దేవుడ్నడ్డం బెట్టుకొని
ఆకలి కొలిమి నార్పే ఇన్ని గంజినీళ్ళు పోయమంటున్నారు.
ఈ రూపాయలు అన్నం ముద్దలౌతాయా..?
ఈ చిల్లరనాణేలు వాళ్ళ చిన్ని డొక్కల్లోని
ఆకలి మొక్కల్ని పీకేస్తాయా..?
ఏమో..! కానీ,
దయలేని తర్కం కన్నా
జాలిగల మానవత గొప్పది కదా..!
మేధకన్నా తడిగల హృదయం కదా
మనిషి చిరునామా..!
జేబు సొరంగంలో మూలుగుతున్న
చివరి ఐదురూపాయల బిళ్ళ తవ్వితీసి
వాళ్ళదేవుడి పటం కుంకుమలో నిమజ్జనం చేసాను.
మరో దగ్గర, ఆ పిల్లల్కెళ్ళి, మళ్ళీ
నిలువుకాళ్ళ విగ్రహాలై నిలబడ్డారు..!

-పి.శ్రీనివాస గౌడ్